క్లుప్తంగా

కన్నులపండువగా.. పవిత్రారోహణ



పవిత్రాలతో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం పవిత్రారోహణను అర్చకులు వేడుకగా నిర్వహించారు. తొలుత యాగశాలలో ఉంచిన పవిత్రాలతో అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థులు ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణల నడుమ దివ్య పవిత్రాలను శ్రీనివాసుని మూలవిరాట్‌పైన, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లపైన ఉంచారు. అలాగే ఆలయంలో కొలువైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు, ఆళ్వార్లపై ఈ పవిత్ర మాలలను వేశారు. తర్వాత ఆలయ యాగశాలలో పవిత్రాంగ హోమం, శాంతి హోమాలను ఘనంగా జరిపారు. దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పుష్పాలంకరణలో శ్రీలక్ష్మీనారాయణస్వామి

నిడదవోలు రూరల్: శ్రావణ మాసం ఆఖరి సోమవారం సందర్భంగా మండలంలోని మునిపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రామాకృష్ణామాచార్యులు పర్యవేక్షణలో స్వామివారిని ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష అర్చనలు, తులసీపూజ జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైద్యానికి ఆర్థిక సాయం

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి గ్రామానికి చెందిన పెచ్చెటి లక్ష్మి అనే మహిళ కాలి తుంటి వద్ద బాల్ విరిగిపోవడంతో వైద్యులు ఇటీవల ఆమెకు ఆపరేషన్ చేశారు. దాంతో ప్రస్తుతం ఆమె ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న మానవత సేవా సంస్థ తణుకు శాఖ సభ్యులు ఆమెకు మందుల ఖర్చు నిమిత్తం ఆ సంస్థ నుంచి రూ.5 వేల ఆర్థిక సహాయం చేసింది. ఈ మొత్తాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు బాలాజీ చేతుల మీదుగా సోమవారం పెచ్చెటి లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ కార్యదర్శి ఆలపాటి సోమేశ్వరరావు, ఆలపాటి సుబ్బారావు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, బి.రామకాశీ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో అన్న సమారాధన

చాగల్లు: శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని చాగల్లు ప్రధాన కూడలిలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయం వద్ద సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఏర్పాట్లను కమిటీ సభ్యులు పరిశీలించారు.

పేదల ఆరోగ్యానికి.. జగనన్న సురక్ష

- ఈనెల 15న కార్యక్రమం ప్రారంభం
- ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు
- 30 నుంచి ప్రతి మండలంలో మెగా వైద్య శిబిరం
- కొవ్వూరు డివిజన్‌లో 20 పీహెచ్‌సీలు, 157 హెల్త్ క్లినిక్‌లు



తాడిమళ్లలో కొత్తగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

నిడదవోలు రూరల్: ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మెరుగైన వైద్యం అందించేందుకు పట్టణాలు, పల్లెల్లో ఇప్పటికే ఆరోగ్య సిబ్బందిని నియమించింది. అలాగే మండల కేంద్రాల్లో అత్యాధునిక హంగులతో ఆస్పత్రులను నిర్మించి వైద్యులను అందుబాటులో ఉంచింది. వైద్యం కోసం రోగులు రావడం కాదు.. రోగుల వద్దకే వెళ్లి వైద్యం అందించేలా ‘ఫ్యామిలీ డాక్టర్’ విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఎన్నో విప్లవాత్మక చర్యలతో దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఈనెల 15న నూతనంగా ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. దీనిలో భాగంగా ఇంటింటా ప్రజల ఆరోగ్యంపై సర్వే చేసి వైద్య సేవలందించేలా కార్యాచరణ రూపొందించింది.

వైద్య నిపుణుల పర్యవేక్షణలో..

కొవ్వూరు డివిజన్ పరిధిలోని కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో 20 పీహెచ్‌సీలు, 157 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30న మండలాల వారీగా మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉంటారు. వారితో పాటు 104 వాహనంలో విధులు నిర్వహించే డాక్టర్ కూడా సేవలందిస్తారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఈనెల 15 నుంచి ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాల్లోని రోగులను పరిశీలించి, వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. రోగులకు చికిత్స అవసరమైతే వెంటనే ఆస్పత్రులకు పంపిస్తారు. వైద్యాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.

కార్యక్రమం లక్ష్యాలు..

- ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేయడం



కంసాలిపాలెం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

- ఆరోగ్య సమస్యలు ఉంటే పరిష్కరించడం
- వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఏఎన్‌ఎం సందర్శన షెడ్యూల్‌ను తెలియజేయాలి.

సద్వినియోగం చేసుకోవాలి



వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈనెల 15 నుంచి ఇంటింటికీ వెళ్లి ఏఎన్‌ఎం, వలంటీర్ సర్వే నిర్వహిస్తారు. 30 నుంచి ప్రతి మండలంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మెగా హెల్త్ క్యాంపు ఉంటుంది. ప్రతి క్యాంపుల్లో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లతో పాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారు. ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి.

– ఎ.అమరేంద్ర, పీహెచ్‌సీ వైద్యాధికారి, సమిశ్రగూడెం

- ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించడం.
- ఆరోగ్య వివరాలను కేస్ షీట్‌లతో పాటు పరీక్ష ఫలితాలను వైద్యులకు అందుబాటులో ఉంచడం. తర్వాత ఆరోగ్య శిబిరాల ఏర్పాటు.
- ఆరోగ్య శిబిరంలో రోగులను వైద్యులు పరీక్షించి మందులు అందజేయడం.
- అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం వైద్య నిపుణులకు, ఆస్పత్రులకు సిఫార్సు చేయడం.

దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పిల్లలు, మధుమేహం, గుండె, క్యాన్సర్ వంటి వివిధ రోగాలున్న వారిని గుర్తించే ప్రత్యేక లక్ష్యంతో అన్ని ఇళ్లనూ సర్వే చేయాలి.

పూజకు గణనాథులు సిద్ధం



దేవరపల్లిలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

దేవరపల్లి: గణపతి నవరాత్రుల సందర్భంగా గణనాథుల విగ్రహాలు పూజకు సిద్ధంగా ఉన్నాయి. తయారీ కేంద్రాల్లో విగ్రహాలను అమ్మకానికి సిద్ధం చేశారు. వివిధ సైజుల్లో రంగురంగుల విగ్రహాలను తయారు చేసి దేవరపల్లిలో విక్రయిస్తున్నారు. అడుగు ఎత్తు నుంచి 10 అడుగుల ఎత్తు వరకూ విగ్రహాలను శిల్పులు తయారు చేశారు. చవితి ఉత్సవాల నిర్వాహకులు విగ్రహాల కొనుగోలు చేస్తున్నారు. విగ్రహాన్ని బట్టి ధర పలుకుతున్నాయి. రూ.5 వేల నుంచి 20 వేల వరకూ రేటు ఉన్నాయి. ఆలయాల వద్ద ప్రతిష్ఠించడానికి భారీ విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో చవితి ఉత్సవాల సందడి మొదలైంది. ఆలయాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాలకు రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి 26 వరకూ గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

చిన తిరుపతిలో కానరాని బంద్



ద్వారకాతిరుమల గుడి సెంటర్‌లో సజావుగా సాగుతున్న వ్యాపారాలు

ద్వారకాతిరుమల: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి అరెస్టును పురస్కరించుకుని ఆ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం చేపట్టిన రాష్ట్ర బంద్ చినవెంకన్న క్షేత్రంలో కానరాలేదు. ఉదయం నుంచి ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. అలాగే అన్ని ప్రభుత్వ పాఠశాలలు, దుకాణాలు ఉదయమే తెరచుకున్నాయి. కొందరు టీడీపీ నాయకులు దుకాణాలను మూయించినప్పటికీ, కొద్దిసేపటికే మళ్లీ వ్యాపారులు వాటిని తెరిచారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోను ఇదే పరిస్థితి నెలకొంది. చంద్రబాబు అరెస్టుపై ఎక్కడా ప్రజా స్పందన కనిపించలేదు. కేవలం టీడీపీ నాయకులు మాత్రమే బంద్‌ను జరిపించేందుకు నానా తంటాలు పడ్డారు. అయినా ఫలితం దక్కలేదు. ఇదిలా ఉంటే బంద్ రోజున దైవ దర్శనానికి వెళ్లి ఇబ్బందులు పడడం ఎందుకని కొందరు భక్తులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. దాంతో శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ తగ్గింది.

ఇది చంద్రబాబుకు తగిన గుణపాఠం

వైఎస్సార్ సీపీ నల్లజర్ల మండల కమిటీ సమావేశం



నల్లజర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు గగ్గర శ్రీనివాస్

నల్లజర్ల: నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ పేరుతో ప్రజా ధనాన్ని కొల్లగొట్టిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి తగిన గుణపాఠం లభించిందని వైఎస్సార్ సీపీ మండల కమిటీ పేర్కొంది. ఆ పార్టీ మండల కమిటీ సమావేశం సోమవారం సాయంత్రం నల్లజర్లలో పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. చంద్రబాబు అరెస్టు అక్రమం అంటూ రోడ్డెక్కి గగ్గోలు పెడుతున్న టీడీపీ నాయకుల వ్యాఖ్యలను ఈ సమావేశం ఖండించింది. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ వ్యవహారంలో చంద్రబాబు చేసింది సక్రమమే అయితే కోర్టులో నిజం నిరూపించుకొని కడిగిన ముత్యంలా బయటకు రావాలని వక్తలు సూచించారు. చంద్రబాబు అవినీతికి సంబంధించి సీఐడీ అధికారులు పక్కా ఆధారాలు సేకరించాక, అరెస్ట్ చేశారే తప్ప ఈ వ్యవహారంలో వైఎస్సార్ సీపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. టీడీపీ అధినేతపై కక్ష సాధించాల్సిన అవసరం తమ పార్టీకి లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు అవినీతి వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ శ్రేణులు డిమాండ్ చేశాయి. సమావేశంలో నల్లజర్ల, పోతవరం సొసైటీల అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ, నాయకులు బంక అప్పారావు, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, ముప్పిడి వెంకటరత్నం, తొమ్మండ్రు రమేష్, ఈలపోలు చంద్రరావు, బండి చిట్టి, చేబ్రోలు బాలాజీ, కోరుకొండ శ్రీనివాస్, గోగులమండ బాబ్జీ, షేక్ సిరాజుద్దీన్, యడ్లపల్లి మంగరాజు, నక్కా పండు తదితరులు పాల్గొన్నారు.

లోతైన దర్యాప్తు తర్వాతే చంద్రబాబు అరెస్ట్

దేవరపల్లి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో లోతైన దర్యాప్తు తర్వాతే సాక్ష్యాలతో సీఐడీ అధికారులు టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిస్తే న్యాయస్థానం రిమాండ్ విధించిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ అన్నారు. దేవరపల్లిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేవరపల్లి, గోపాలపురం మండలాల కన్వీనర్లు కూచిపూడి సతీష్, పోతిరెడ్డి నాగరాజు మాట్లాడారు. చట్టం ముందు అందరూ సమానమేనని, చట్టం ఎవరికీ చుట్టం కాదన్నారు. చంద్రబాబు అరెస్టుతో చట్టాలపై ప్రజలకు విశ్వాసం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. చంద్రబాబు పాలనలో జరిగిన అనేక కుంభకోణాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తాయన్నారు. చంద్రబాబు అరెస్ట్ రాజకీయ కక్ష సాధింపు కాదని, చట్ట ప్రకారం జరిగిందని వారు పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకున్నారు కాబట్టే టీడీపీ బంద్‌కు సహకరించలేదన్నారు. సమావేశంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ గోపాలపురం మండల మహిళా విభాగం అధ్యక్షురాలు యంటపల్లి కవిత, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత పాల్గొన్నారు.

కోర్టు రిమాండ్ విధించాక బంద్‌?

ద్వారకాతిరుమల: ప్రజాధనాన్ని లూటీ చేసి అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించిన తరువాత ఆ పార్టీ నేతలు బంద్ చేపట్టడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు అన్నారు. తిమ్మాపురంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు తన స్కిల్స్ అన్నీ ఉపయోగించి స్కిల్ డెవలప్‌మెంట్‌లో స్కామ్ చేసి అడ్డంగా దొరికిపోయాడన్నారు. దానికి అన్ని సాక్ష్యాధారాలు ఉండబట్టే కోర్టు ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. జగన్ ప్రభుత్వం నిజంగా కక్ష సాధిస్తే తన జీవితంలో చంద్రబాబు జైలు నుంచి బయటకు రాలేడన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, గ్రామ సర్పంచ్ ఎర్రగొల్ల రజని, పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు మరో స్థలం చూడండి

- అధికారులకు ఎమ్మెల్యే తలారి సూచన
- సేకరించిన స్థలంపై అసంతృప్తి



గుడ్డిగూడెం రోడ్డులో సేకరించిన ఇళ్ల స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు

గోపాలపురం: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మండల స్థాయి అధికారులకు సూచించారు. పేదల ఇళ్ల స్థలాల కోసం గోపాలపురం గుడ్డిగూడెం రోడ్డులో కొనుగోలు చేసిన స్థలాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణాలకు అనువుగా ఉండే స్థలాన్ని సేకరించాలని సూచించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సేకరించిన స్థలం ఇళ్ల నిర్మాణాలకు వీలుగా లేనందున వేరే స్థలాన్ని కేటాయించాలని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, ఎస్‌కె వల్లీ, వెలగా శ్రీరామమూర్తి, దాసరి కుటుంబరావులు ఎమ్మెల్యేను కోరారు. వారి విజ్ఞప్తి మేరకు పేదల గృహ నిర్మాణాలకు అనుకూలంగా ఉండే మరో స్థలాన్ని ఎంపిక చేయాలని డిప్యూటీ తహసీల్దార్ ఎస్.కృష్ణ, ఎంపీడీఓ శ్రీదేవిలకు ఎమ్మెల్యే సూచించారు.

పలువురికి పరామర్శ

గోపాలపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వింత ప్రసాదరెడ్డి తండ్రి సత్యనారాయణ రెడ్డి భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సందర్శించి నివాళులు అర్పించారు. ఇటీవల పెద్దగూడెంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుమ్మడి ప్రసాద్, ముప్పిడి వెంకటరెడ్డి కుటుంబాలను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు.

చాగల్లులో ఐ.పంగిడి బాలుడి అదృశ్యం

చాగల్లు: కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామానికి చెందిన వీరపల్లి హోసన్న అనే తొమ్మిదేళ్ల బాలుడు ఆదివారం చాగల్లులో అదృశ్యం అయ్యాడు. చాగల్లు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆ బాలుడు తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం చాగల్లులోని చర్చికి వచ్చాడు. హోసన్న మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడు. అతడికి మాటలు రావు. ప్రార్థన సమయంలో చర్చి నుంచి బయటికి వచ్చి అదృశ్యం అయ్యాడు. బాలుడి తండ్రి జాన్‌రత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

కొవ్వూరు: మండలంలోని కుమారదేవం గ్రామంలో సోమవారం ఆటోను లారీ ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో తాళ్లపూడికి చెందిన నందం హర్షిత్ రఘురామ్ అనే తొమ్మిదేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. తల్లి జయ సూర్యకుమారితో కలిసి ఆటోలో వెళుతుండగా హర్షిత్ రఘురామ్‌కు ఈ ప్రమాదం సంభవించింది. సూర్యకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం బాలుడు రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు.

తెలుగుదేశం పార్టీ బంద్ విఫలం

- యథావిధిగా తిరిగిన బస్సులు, వాహనాలు
- మూతపడని దుకాణాలు
- పట్టించుకోని సాధారణ ప్రజానీకం



కొవ్వూరులో నడుస్తున్న బస్సు



నిడదవోలు ఆర్టీసీ డిపో వద టీడీపీ నాయకుల హడావుడి

కొవ్వూరు: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి అరెస్టుకు వ్యతిరేకంగా ఆ పార్టీ సోమవారం నిర్వహించిన రాష్ట్ర బంద్ కొవ్వూరులో విఫలమైంది. బంద్‌కు ప్రజల నుంచి ఎలాంటి స్పందనా కనిపించలేదు. టీడీపీకి మద్దతు ప్రకటించిన పార్టీలు కూడా బంద్‌లో ఎక్కడా కనిపించలేదు. ప్రతి సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగింది. వాహనాలపై వచ్చిన టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలను, పెట్రోల్ బంక్‌లను కొద్దిసేపు మూయించి వేశారు. బంద్ ప్రకటనతో ప్రైవేటు విద్యాసంస్థలు ముందస్తుగానే సెలవు ప్రకటించాయి. ప్రభుత్వ పాఠశాలలు మామూలుగానే నడిచాయి. ఆర్టీసీ బస్సులు రోజువారీగా తిరిగాయి. ఆటోలు, లారీలు, ఇతర వాహనాలు సైతం యథావిధిగా నడిచాయి. టీడీపీ బంద్ పిలుపుతో కొందరు వ్యాపారులు దుకాణాలను తెరవలేదు. కొవ్వూరు మెయిన్ రోడ్డులో దుకాణాలు పాక్షికంగా తెరుచుకున్నారు. మధ్యాహ్నం నుంచి ఎక్కువగా దుకాణాలను తెరిచారు. కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో ఇసుక ర్యాంపులు పనిచేశాయి. కొవ్వూరు బంద్ నిర్వాహకులు అవాంఛీయ ఘటనలకు పాల్పడకుండా డీఎస్పీ వీఎస్‌ఎన్ వర్మ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అల్లర్లకు ఆస్కారం లేకుండా కొవ్వూరు బస్సు స్టేషన్‌లో అదనపు బలగాలు గస్తీ కాశాయి. దొమ్మేరులో టీడీపీ కొద్దిసేపు నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఐ.పంగిడిలో టీడీపీ, జనసేన నాయకులు కలిసి వెళ్లి దుకాణాలను మూయించి వేశారు.

నిడదవోలు: టీడీపీ తలపెట్టిన బంద్ పట్టణంలో విఫలమైంది. ప్రజల నుంచి స్పందన కరవైంది. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో పట్టణంలో దుకాణాలను మూయించి వేశారు. అయితే గంట లోపుగానే తిరిగి దుకాణాలు తెరుచుకున్నారు. 144 సెక్షన్ అమలులో ఉండడంతో పోలీసులు ఎక్కడికక్కడ టీడీపీ నాయకులను నిలువరించారు. విద్యాసంస్థలు యథావిధిగా పనిచేశారు. బస్సులు కూడా నడిచాయి. టీడీపీలోని మరో వర్గం నేత కుందుల సత్యనారాయణకు చెందిన టీడీపీ నాయకులు బంద్‌లో పాల్గొని దుకాణాలు మూయించారు. పట్టణంలో టీడీపీ రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

గోపాలపురంలో రెండు వర్గాలుగా..

గోపాలపురం: గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు వర్గీయులు వేర్వేరుగా గోపాలపురంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వారికి జనసేన పార్టీ నాయకుల మద్దతు పలికారు. మండలంలోని టీడీపీ నాయకులు రెండు గ్రూపులుగా ఏర్పడి గోపాలపురంలోని ప్రభుత్వాఫీసులు, దుకాణాలు మూయించి వేశారు. మద్దిపాటి వర్గం స్థానిక చెక్ పోస్టు సెంటర్ వద్ద దీక్షల చేపట్టారు. ముప్పిడి వర్గీయులు గ్రామంలో ఉన్న కొన్ని దుకాణాలకు మూయించారు. మళ్లీ తెరుచుకున్నాయి.

పెరవలి: తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు పెరవలి కూడలిలోని షాపులను, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు, పాఠశాలలు, వ్యాపార సంస్థలను ఉదయం మూయించి వేశారు. పెరవలి సెంటర్‌లో ఇరు పార్టీల నాయకులు కొద్దిసేపు నిరసన తెలిపారు. అయితే మధ్యాహ్నం నుంచి వ్యాపార సంస్థలు యథావిధిగా పనిచేశాయి. తెలుగుదేశం మండలశాఖ అధ్యక్షుడు అతికాల శ్రీనివాస్, జనసేన పార్టీ అధ్యక్షుడు పిప్పిర రవి తదితరులు బంద్‌కు సారథ్యం వహించారు.

తాళ్లపూడి: జనసేన శ్రేణులతో కలిసి టీడీపీ నేతలు తాళ్లపూడిలో దుకాణాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను మూయించి వేశారు. స్థానిక బజార్ సెంటర్లో నిరసన తెలిపారు. కాగా టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ పార్టీలోని కాకర్ల సత్యేంద్ర తదితరులు అక్కడే ఆందోళన చేపట్టారు. మధ్యాహ్నం నుంచి దుకాణాలను యథావిధిగా తెరిచారు. బంద్ పాక్షికంగా జరిగింది.

చాగల్లు: టీడీపీ, జనసేనల ఆధ్వర్యంలో చాగల్లులో ఉదయం దుకాణాలు, బ్యాంకులు, పాఠశాలలు మూయించి వేశారు. మధ్యాహ్నం నుంచి దుకాణాలను యథావిధిగా తెరిచారు. ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి. నిడదవోలు– పంగిడి రహదారిపై వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. చాగల్లు, బ్రాహ్మణగూడెం, కలవలపల్లి తదితర గ్రామాల్లో టీడీపీ, జనసేన శ్రేణులు రోడ్లపైకి వచ్చి కొద్దిసేపు నిరసన తెలిపారు.

దేవరపల్లి: ఉదయం తొమ్మిదింటికే దేవరపల్లిలో టీడీపీ నాయకులు దుకాణాలను మూయించారు. టీడీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దిపాటి వెంకటరాజు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆందోళన నిర్వహించారు. ముప్పిడి స్థానిక బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. దుకాణాలు మూయించిన గంట వ్యవధిలోనే తిరిగి తెరిశారు. యర్నగూడెంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు.

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం, తాడిమళ్ల, కోరుమామిడి గ్రామాల్లో టీడీపీ శ్రేణులు నిరసన తెలిపాయి. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, దుకాణాలను మూయించి వేశారు.

నల్లజర్ల: మండలంలో బంద్ పాక్షికంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు ఉదయం కొద్దిసేపు నల్లజర్ల సెంటర్‌లో ఆందోళన చేశారు. కార్యాలయాలు తొలుత కొద్దిసేపు మూసేసినా తర్వాత యథావిధిగా పనిచేశాయి. బంద్ ప్రభావం ప్రజలపై ఏమాత్రం పడలేదు.